# చిఱునవ్వు

శ్రీమతి గుడ్లదొన రాఘవమ్మ

ఈ చిఱునవ్వును గూర్చి వ్రాయాలంటే బోలెడంత గ్రంథమై కూర్చుంటుంది. మహా మహా గ్రంథాల దగ్గరనుంచి చిట్టిచిట్టి పాటలదాక చిఱునవ్వులేనివి లేవనడం అతిశయోక్తి కాదు! అసంభవం కాదు. గ్రంథాలల్లో నాయికా నాయకులకు ఈ చిఱునవ్వు ఒకలక్షణం. నాయకలక్షణం కూడ. ఎక్కడో ఒక చోట కనీసం చిఱు నవ్వు నవ్వకుండ ఉండే పాత్రలే అరుదు. నాయకునికంటె నాయిక చిరునవ్వునకు విలువ ఎక్కువ. ఈ చిఱునవ్వు విలువ కొన్ని పాత్రలలో చిల్లిగవ్వ ఖరీదుచేయక పోయినా కొన్ని చోట్లమాత్రం లక్షలు కోట్లుమించి రాజ్యాల ఖరీదు చేస్తుంది. కొన్నిచోట్ల ఈ విలువ విపమించి జీవితాల ఖరీదుకూడా చేస్తుంది. కొన్నిసమయాలలో ఈ చిఱునవ్వు జీవితాలకు జీవితాలనే కొనేస్తుంది.

ఈ చిరునవ్వుకు మొలకనవ్వు, లేత నవ్వు, లేనవ్వు, మందస్మితము, మందహాసము, ఇత్యాదయః, ఎన్నో పేర్లున్నాయి. చిఱునవ్వు కొంచెం మోతాదు మించితే నవ్వు అవుతుంది. ఇంకొంచెం మించితే వెడనవ్వుగా మారుతుంది. అదే అట్టహాసం. అట్టహాసం అనేప్పటికి అసహ్యం, హడలు పుట్టటం సహజం. స్త్రీ ఎప్పుడు కూడ అట్టహాసం చెయ్యదు, ఒక వేళ చేసేదైతే స్త్రీత్వం పాలు తక్కువగా ఉన్నట్టిదై ఉంటుంది.

మనకవులు ఈ చిరునవ్వును ఎన్ని విధాల నవ్వాలో అన్నివిధాల నవ్వి చూచారు.

మొలక నవ్వులతోడ కలకదేరిన యట్టి
తరుణిముఖాబ్జంబు తమ్మికోడు - అన్నాడొకకవి,
వెలది నీ చిఱునవ్వు వెన్నెల గనుమన్న
కామాంధ కారంబుగలగు నెట్లు.

ఈ చిఱునవ్వు వెన్నెలగా తోచిందా కాముకుడికి. ఈ వెన్నెల తగిలితేగాని ఆ అంధకారం పటాపంచలుగాదట.

ఇక ముక్కు తిమ్మన ముద్దుముద్దుగా నవ్వినాడు-'కనుగవ చిన్ననవ్వు దొలక మునినాథుని కన్నుసన్న'-కృష్ణుడు రుక్మిణికి పారిజాతము యిచ్చాడట. ఆ నవ్వులో రాబోయే కాబోయే రసాభాసమంతా యిమిడిఉంది.

"కాలితన్నులు తిన్నా భార్యను కలక దేర్చిన ఘనుడు కృష్ణుడు. ఆత్మహృదయేశ్వరి గన్గొని శౌరి మందహాసాంచిత నేత్రుడై" నాడట. అంత కష్టానికి అది ఫలితం. అంటే చమట తుడిచి వేసుకున్నాడన్నమాట.

రాజసాన్ని చూపించడానికి కూడ తిమ్మన చిఱునవ్వును వినియోగించు

కున్నాడు. కృష్ణుడు దేవతలందరను స్మేరాపాంగ విలోకనక్రియల సంప్రీతాత్ముల జేసినాడట.

ఇక పెద్దనప్రార్థన దగ్గరనుంచె మొదలుపెట్టినాడు-'అల్లన మేలమాడున చలాత్మజ మాటకు లేతనవ్వు సంధిల్ల'-ఆమేలమాడటం లేకపోతే ఈ లేతనవ్వు లేదు. ఈనవ్వు లేకపోతే కిరీటికి పాశుపతం లేదు.

భారతమంతా ద్రౌపతి చిరునవ్వు మీదనే ఆధారపడి ఉన్నది. ఆ ద్రౌపది ఆ నాడు దుర్యోధనుణ్ణి చూచి నవ్వకపోతే అసలు భారతకథే అట్లాసమాప్తమయ్యేది కాదేమో.

కృష్ణదేవరాయలు భువనవిజయంలో కూర్చొని కవుల ప్రసంగాలు వినేవాడట. సమస్యలను కవులు పూరించేటప్పుడు వారికిచ్చే విలువ చిఱునవ్వులతో విలువకట్టేవాడట. ఆయన ఎన్నిమార్లు పెదవివిప్పితే అన్ని పదివేల దీనారాలా కవికి ముట్టేవట. చిఱునవ్వులను లెక్కపెట్టి తిమ్మరుసు డబ్బు పంపిణీ జరిపేవాడట. ఈ విషయం నిజమో కవిపలుకో తెలియదుగాని ఆ సార్వభౌముని చిఱునవ్వుకు ఆ విలువ చాలదేమో.

ఇక నండూరివారి ఎంకి నవ్వేనవ్వులకు అంతేలేదు. కన్యాశుల్కంలోని మధురవాణి మందస్మితాలు మనకూ తెలుసు.

కవులవిషయం వదలి స్త్రీలవిషయంలోకొస్తే స్త్రీకి చిఱునవ్వు స్వతహాగా జన్మలక్షణాలలో ఒకటి. మంచి లక్షణాలలోనే లెక్కవేయవచ్చు. అతిగా నవ్వే స్త్రీని స్త్రీలే అసహ్యించుకుంటారనటం సత్య వెకిలినవ్వు అంటారు దాన్ని. ఆ నవ్వునవ్వే స్త్రీకి స్త్రీసమాజంలో స్థానమే లేదు-ఉన్నా కట్టకడాపక్షే.

చిరునవ్వును తెలివితేటలతో విసరాలంటారు. చిరునవ్వు దొంతరలు కమ్ముకొనివస్తేగాని నేటినవలలు పూర్తిగావు. భర్తను లోబరుచుకోడానికి స్త్రీకి బాణం చిరునవ్వు. కష్టించి వచ్చిన భర్తకు బడలిక తీర్చాలంటే చిరునవ్వుతో భార్య ఎదురైతే చాలు. మగవాడికి గాలం ఆ చిరునవ్వు. కాని కన్యలు నవ్వే చిరునవ్వులు వాండ్ల స్వంత కంఠానికి ఒక్కొక్కప్పుడు కత్తెరలవుతుంటవి. ఈ చిరునవ్వులకు పిచ్చెత్తిపోయేమగవాండ్లున్నారు. ఒకపర్యాయం వాండ్లకి చిరునవ్వు తగిలిందా ఇక సర్వనాశనమే. స్త్రీ చిరునవ్వును మితంగా ఉపయోగించుకుంటే ఆత్మరక్షణకది అవసరమైన బాణంగా ఉపయోగిస్తుంది అనడం నిర్వివాదం.

లేనినవ్వును తెచ్చుకుంటే అది చిరునవ్వురూపంలోనే అంతరిస్తుంది. నవ్వురూపంలోకి దాన్ని తెస్తే అసలు స్వభావం

బయటబడుతుంది. ఒక్కొక్కప్పుడు లేని నవ్వును తెచ్చుకోవలసిన పరిస్థితులు ఏర్పడుతవి. స్వభావసిద్ధంగా వచ్చేనవ్వును తెచ్చుకుంటే వచ్చిన నవ్వుకు ఎరువు జాకెట్లు తొడుక్కున్నట్లుంటుంది. ఈ లేని నవ్వును తెచ్చుకొని నవ్వడం స్త్రీలకన్న పురుషుల్లో త్వరగా బయటపడిపోతుంది.

కుటిలంగా నవ్వడం - లోపల విషం పెట్టుకొని పైకినవ్వే చిరునవ్వులు యాటం బాంబులకన్నా ఘోరంగా పనిచేస్తవనడం సాహసం కాబోదు.

ఈ చిఱునవ్వుకు మూలం చిన్నబిడ్డలు. మాట్లాడ్డానికి చేతకాకపోయినా నవ్వడం మాత్రం ఏమీ తెలియనిస్థితిలోనే తెలుస్తుంది పసి బిడ్డలకు. ఆ పసిబిడ్డల చిరునవ్వులకొఱకు ఎదురు చూస్తుంటుంది మాతృదేవత బిడ్డ చిరునవ్వు కన్నా ఆనందకర విషయం తల్లికి యింకోటి ఉండబోదు. ఇది అనుభవైకవేద్యంమాత్రమేగాని చెప్పినప్పుడే తెలిసేవిషయం కాదు. పసికందులు పెదాలు విప్పి బోసి నోటితో నవ్వుతారే కాని పెద్దగానవ్వరు. అసలు చిరునవ్వుకిదే ప్రాతిపదిక.

పూలలో పొంగేటి పాలనవ్వులను
నీ వెండిగిన్నెలో నింపి నెమ్మదిగా
మా చిన్నపాపకు మాపు రేపుల్లు
చల్లగా తెచ్చియ్యి చందమామయ్య

అంటారు రాయప్రోలువారు.

ఆ పాలనవ్వులలోని అంతరార్థాన్ని గ్రహించడానికి ఆ తల్లి హృదయానికి మాత్రమే సామర్థ్యముంటుంది. ఇతర్లు మాత్రం ఆనందిస్తారు.

'కన్నవెన్నెల లాలికించు చిన్ననవ్వు ఎట్టుమరతును నినుగన్న చిట్టితండ్రి' అని వాపోయాడు నాళం కృష్ణారావుగారు.

